కథానిక

# ఉత్తమ చిత్రం

ద్రోణంరాజు కృష్ణమోహన్

రోజూ సాయంకాలం ఆఫీసు వదలగానే ఇళ్లకు పోయే ముందు కాసేపు కాలవగట్టున యిసుక తిన్నెల మీద కూర్చుని బాతాఖానీ కొట్టటం వాళ్లకలవాటు. 'వాళ్లు' అంటే ఎవరో అనుకుంటున్నారా? చెపుతా వినండి. ఒకరు కాబోయే సుప్రసిద్ధ దర్శక, చిత్ర నిర్మాత మహేంద్రనాథ్, రెండవవారు త్వరలో సినిమా రంగంలో ప్రవేశించి అగ్రస్థానం అలంకరించబోయే ప్రసిద్ధ దర్శకులు శ్రీ శర్మ, మూడవవారు కాబోయే కవి శిఖామణి ప్రేమనాథ్ గారు. రోజూ వాళ్లు ముగ్గురూ ప్రేమ, రాజకీయాలు, యిత్యాది విషయాలు చర్చిస్తూ వుంటారు. మామూలు ప్రకారం ఆరోజుకూడా బాతాఖానీ ఆరంభించి చివరకు వేదాంతంలోకి దిగారు. ఉన్నట్లుండి హఠాత్తుగా ప్రేమనాథ్ సంభాషణ కట్టిపెట్టి.

"ఏరా, మహేంద్రుడూ! నీకెందుకురా ఈ వందరూపాయల ఉద్యోగం? రెండు, మూడు లక్షల రూపాయల ఆస్తివుంది కదా! ఒక్క సినిమా తియ్యకూడదుట్రా" అని అడిగాడు.

"నిజమేరా! నువ్వు సరేననూ. మిగతా విషయాలు నేనూ, కవి చూస్తాం" అన్నాడు శర్మ.

మహేంద్రుడు ఏ మాత్రం ఆలోచించకుండా "నా మనసులో మాట చెప్పేవారురా. ఎంతో కాలంనుంచి నేను కలలు కంటున్నా దీన్ని గురించి. మద్రాసులో మా స్నేహితుడొకడున్నాడు కూడా. కనీసం సినిమాలో యాక్టరుగానైనా చేరితే బాగుండునని అనిపించేది. కాని మా వాళ్లు పడనివ్వలేదురా అప్పుడు. యిప్పుడు మనకిక ఏమీ అడ్డు చెప్పరనుకో. అయినా సినిమా రంగంలో నాకెవరితోనూ పరిచయం లేదుగా, ఎట్లా?" అని సందేహాన్ని బయట పెట్టాడు.

"అదెంత పనిరా! డబ్బు చేతిలో వుండాలి. మిగతా వన్నీ వాటంతటవే మన కాళ్ళ దగ్గర కొస్తాయి" అని ధైర్యంగా చెప్పాడు శర్మ.

"అదీ సంగతి! ప్రేమా గీమా అంతా డబ్బుకు దాసోహం చేసేవాళ్లే. అదుంటే ఎన్ని నాటకాలన్నా ఆడొచ్చు" అని తేలికగా చెప్పేశాడు కవిగారు.

"మీరు చెప్పేది బాగుంది. కాని ఒక్క ఏడాదిలో మనం బోర్డు తిరగేసి టిక్కెట్టు లేకుండా యింటికి రావాలి కదా!" అని తన భయం బయటపెట్టాడు మహేంద్రుడు.

"అదెన్నటికీ జరగదు. నా చేతిలో కలం వుండగా అలా జరగనిస్తానా" అని అభయమిచ్చాడు ప్రేమనాథ్.

"నేను డైరెక్టరుగా వున్నంత కాలం నాకింద అసిస్టెంట్లుగా పని చేయడానికి పేరు పొందిన దర్శకులంతా రారుట్రా, నీ కెందుకు భయం?" అన్నాడు శర్మ.

"సరే అంతా బాగానే వుంది. చిత్రం తీయడం ఖాయమైతే ఏం పేరు పెడదాం?"

"నా కాయానం" అన్నాడు కవి.

"ఛీ. ఛీ అదేం పేరురా, [illegible]! మంత్రరత్నం అనే పేరుతో జానపద చిత్రం తీద్దాం. అలా అయితే కావలసినన్ని డ్యాన్సులు, పాటలు, నాయకీనాయకుల శృంగార దృశ్యాలు, చేర్చటానికి వీలవుతుంది" అన్నాడు శర్మ.

"అబ్బే అదికాదు. "మాయ లీల" అని పెడదాం" అన్నాడు మహేంద్రుడు.

"అదికాదురా, "ప్రేమ లీల" అని పేరు పెట్టి ఒక ట్రాజెడీయో, కామెడీయో తీద్దాం. మద్రాసులో ఒక ట్రాంలో యిద్దరూ కలుసుకొన్నట్లు, ముందు నాయిక నాయకుని చెంప దెబ్బ కొట్టినట్టు, తరువాత యింటిదగ్గర కొస్తే నాయకునికి చెప్పుదెబ్బలు. చివరకు చెంపదెబ్బ, చెప్పుదెబ్బ, రెండూ కలిసి ప్రణయబంధంగా మారటం. ఏం బాగుందలా?" అని అడిగాడు కవి.

చివరకు ఎలాగయితేనేం "మాయలీల" ఖాయం చేశారు.

"అయితే నేను హెడ్మాస్టరు కాబట్టి, ముందు మీ తెలివి తేటలు కాసేపు పరీక్షిస్తా, సరదాగా. ఏం?" అని అడిగాడు మహేంద్రుడు.

"ఓ, దానికేం! ఇక్కడ యితరులెవ్వరూ లేరుగా మనల్ని వెళాకోళం చెయ్యటానికి. ఎలా వుంటాయో మా తెలివితేటలు. భావాలు, చూడు ముందు" అని యిద్దరూ అన్నారు.

"అయితే. కవీ, మన సినిమాకథ ముందు టూకీగా చెప్పు" అన్నాడు మహేంద్రుడు. ఇక మొదలెట్టాడు కవిగారు.

"ముందు! ఒక మహారాజు. ఆయనకు యిద్దరు భార్యలు. పెద్దరాణీగారు అడవిలో వదలి పెట్టబడటం. అక్కడ జంతువులో లేక మునీశ్వరులో ఆమె ప్రసవిస్తే వుపచారాలు చేయడం. తరువాత రాజకుమారుడు పెద్దవాడవటం. పరాయిదేశం రాకుమార్తె రెండు దేశాల మధ్య భయంకరమైన అగాధాలు, దెయ్యాలు, రాక్షసులు చివరకు పరమేశ్వరుడు. ఆతరువాత కనీసం ముగ్గురినైనా రాకుమారుడు పెళ్లి చేసుకుని సుఖించడం—యిది విషయం" అని చిటికె వేశాడు కవిగారు.

ఇద్దరూ చప్పట్లు కొట్టారు.

"భేష్. "సినిమాకథ" అంటే యిలా వుండాలి. అపూర్వమైన కథ. సరే, ఇక నీ తెలివితేటలు డైరక్షన్. ఎలా వుంటాయో, చూపించు, శర్మా" అన్నాడు మహేంద్రుడు.

"ఏదయినా ఒక సంఘటన చెప్పరా కవీ" అన్నాడు శర్మ.

"ప్రేమ" అన్నాడు కవి.

"ఎక్కడ?" అని అడిగాడు మహేంద్రుడు.

"అసంతా ఎందుకులే, ఏదో ఒక చెట్టు క్రింద" అని సరిపుచ్చాలని చూశాడు శర్మ కాని.

"లేదు కొండగుహలో" అన్నాడు కవి.

"ఏవేళప్పుడు?" అని ఆతృతగా అడిగాడు మహేంద్రుడు తన లాభనష్టాలన్నీ వీటిల్లోనే వున్నట్టు.

"ఏవేళ అయితేనేమి! సరే పోనీ, వెన్నెల రాత్రి అనుకుందాం" అన్నాడు శర్మ.

"అలా అయితే కొండగుహ పనికిరాదు. చెట్టుక్రింద, చక్కగా కాలువగట్టున బాగా వుంటుంది" అన్నాడు మహేంద్రుడు.

"ఎవరిమధ్య యీ ప్రేమ? రాజు. రాణి మధ్యనా?" అని అడిగాడు మహేంద్రుడు వెంటనే మళ్లీ.

"ఛీ ఛీ ముసలివాళ్ల కెందుకు గాని? రాజకుమారునికి అతని ప్రియురాలికి జరిగే ప్రేమ సంభాషణ గురించి" అన్నాడు శర్మ. కవికూడా సరేనన్నాడు.

"అయితే ముసలివాళ్ల సంగతేమిటి?" అని ప్రశ్నించాడు మహేంద్రుడు.

"వాళ్ళకో పుణ్యాల బల్ల పారేద్దాం" అని విసుగొచ్చి అన్నాడు కవి.

ఇహ శర్మ తన ప్రతాపం చూపించటం మొదలెట్టాడు కవి భుజంమీద చెయ్యేసి,

"మల్లికా, అదిగో ఆ చంద్రుని చూడు. మనల్ని చూసి యెలా నవ్వుతున్నాడో! ఆజంట పక్షుల్ని చూడు. ఎలా ఆడుకుంటున్నాయో! ప్రేమజీవులమైన మనల్ని విడదీయటానికి ఆ బ్రహ్మకుకూడ తరంకాదు మన ప్రేమబంధం యెవ్వరూ తెంచలేరు యీ మాటలు ఆ చంద్రుని సాక్షిగా, వనదేవత సాక్షిగా, చెపుతున్నా. కావాలంటే యీ కత్తితో నాగుండె చీల్చి చూడు, నీ ప్రతిబింబం తప్ప మరేమయినా కనిపిస్తుందేమో" అని రాకుమారుడు అనగా, రాకుమార్తె వారించినమీదట ఆమెను దగ్గరగా తీసుకుని ఆమె భుజంమీద వాలిపోయినట్టుగా కవిగారి భుజంమీద వాలిపోయాడు శర్మ. కవిగారి నోట్లో సిగరెట్టు శర్మ బుగ్గలకు "చుర్రు"మని అంటుకుంది.

"ఇంకో సంఘటన చెప్పు" అని అడిగాడు వుత్సాహంగా శర్మ.

"రాజకుమారుని వీరత్వం ప్రదర్శించు" అన్నాడు కవి.

వెంటనే ప్రక్కనేవున్న చిన్నపుల్ల చేత్తో పట్టుకుని "నీచుడా! ఇప్పటికయినా చేసిన పాపానికి పశ్చాత్తాపపడి రాజకుమార్తెను వదలిపెట్టు. లేదా నిన్నూ నీ పరివారాన్ని సర్వనాశనంచేస్తా. పరమేశ్వరుడు ప్రసాదించిన యీ

నాకత్తి ముందా. నీ మాయలు మంత్రాలు? మూడురోజులు గడువిస్తున్నా. జాగ్రత్తగా ఆలోచించుకో" అని చేతిలో ఫుల్ల వణికిస్తూ ప్రత్యేకంగా అరిచాడు శర్మ.

"అమోఘంగా వుంది ఇహ చాలులే. నీ ముందు ప్రస్తుతంవున్న డైరెక్టర్లెవరూ పనికి రారు" అని సర్టిఫికెట్ యిచ్చేశారిద్దరూ.

"అయితే రాకుమారుని కొక ప్రాణస్నేహితుడు, రాకుమార్తె కొక ప్రాణసఖి వుండాలను కుంటాను" అని ఆలోచిస్తూ అడిగాడు మహేంద్రుడు.

"అది వేరే చెప్పాలా! ప్రాణస్నేహితుడి పేరు సారంగం, ప్రాణసఖి పేరు వసంత" అని ఒక్క ముక్కలో తేల్చేశాడు కవి

"వీరి హాస్యం సంగతి?" అని ప్రశ్నించాడు శర్మ.

"అది దానంతటదే వుండి తీరుతుంది. హాస్యం చక్కగా పాటలో కూడా కలిపి పెడితే యింకా బాగుంటుంది" అన్నాడు కవి.

"అదికూడా ఒక్క రవ్వ శాంపిల్ చూపించు" అని అడిగాడు మహేంద్రుడు.

"వినండి! 'నా చెంతరా వసంతా. నా మాట వినవసంతా' అని సారంగుడు, 'వద్దు వద్దోయి రంగా, నీ చెంత రానోయి పూలరంగా, మాటయినోయి, సారంగా' అని వసంతా, కలిసి పాడతారు ఏంబాగుంటేలా?" అని అడిగాడు కవి

"భేష్! దివ్యంగా వుంది. ఇహ రేపట్నుంచి చీకటి పడుకోండి" అన్నాడు మహేంద్రుడు.

"వెళ్ళేముందే గాని, యింకొక్క విషయం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సినిమాలో చిట్టచివరన ఒక వుపన్యాసం ఎవరిచేతయినా యిప్పిస్తే బాగుంటుందేమో" అని అడిగాడు శర్మ.

"నిజమేరా! ఆ కాస్తపని కూడా పూర్తి చేస్తే మన చిత్రం సుప్రసిద్ధ విద్యావంతుల్ని, జర్నలిస్టుల్ని, ఆకర్షిస్తుంది.

"దానికేం! పెద్దరాణీగారిచేత మహరాజు చేసిన చర్యలకు వ్యతిరేకంగా ఒక ఘాటైన వుపన్యాసం యిప్పిద్దాం.

"ఇలా యిప్పిస్తే బాగుంటుందేమో చూడండి. 'విచారణ లేకుండా వురితీస్తారా! ఇదా మీ న్యాయం, ధర్మం, నీతి? ఇదేనా మీ శాసనం? మీకీ అధికారాన్ని ప్రసాదించింది ప్రజలు. అడగండి వాళ్ళని ఏమంటున్నారో మీ దౌర్జన్యాన్ని నిరసిస్తున్నారు. ఎంత ఘోరం! మిమ్మల్ని గద్దెక్కించినవారు మిమ్మల్ని దించ గలరని కూడా తెలుసుకోండి' అని యిలాగే యింకా యిప్పిద్దాం" అన్నాడు కవి.

"బాగుంది, మరి పరమేశ్వరుణ్ణి కూడా చివరకు ప్రత్యక్షం చేయిస్తే యింకా బాగుంటుం దేమో?" అన్నాడు మహేంద్రుడు.

"ఓ, దానికేం, మహారాణిగారిని మహా రాజుగారు కాళ్ళమీద పడేయిద్దాం. కన్నీటితో ప్రార్థిస్తుంది కన్నకొడుకుని రక్షించమని. అప్పటికీ మహారాజు లొంగకపోతే, వురుములు. మెరుపులు, వర్షాలతో పరమేశ్వరుడు ప్రత్యక్షమవుతాడు. అప్పుడు మహారాజుకు జ్ఞానోదయం అవుతుంది" అన్నాడు కవి

"అద్భుతంగా వుంది. ఇహ నడుద్దాం పదండి" అన్నాడు మహేంద్రుడు.

ఆ రాత్రి మహేంద్రుడికి కలొచ్చింది. తను నిజంగా మాయలీల చిత్రం తీసినట్టు, మహేంద్రా ప్రొడక్షన్స్ అనే పేరుతో తను త్యాగరాయనగరంలో ఒక కంపెనీ స్థాపించినట్లు, తను తీసిన చిత్రం 1952 సం. తెరకు విడుదలై శతదినోత్సవాలు జరుపుకొన్నట్లు, యింకా యిలాగే కలొచ్చింది. కలలో ఇంకో శుభవార్త కూడా వినవచ్చింది 'ఆంధ్ర ప్రజానీకానికి మాయలీల చిత్రంద్వారా మహేంద్రా ప్రొడక్షన్స్ వారు ప్రసాదించిన దివ్యసందేశం, భారత చలనచిత్ర పరిశ్రమకు వారు సంపాదించిపెట్టిన పేరు ప్రఖ్యాతులు అపూర్వం, అమూల్యం. ఈ చిత్రంలో వున్న విలువను, కళావిశిష్టతను గుర్తించి ప్రభుత్వంవారు యీ చిత్రాన్ని 1952 సం. యొక్క ఉత్తమచిత్రంగా నిర్ణయించి ఒక బంగారు పతకాన్ని బహూకరించదలచారు' అని మంత్రిగారు ఒకానొక శతదినోత్సవ సందర్భంలో వుపన్యసించే సరికల్లా ప్రజాసమూహాలు హర్షధ్వానాలు చేశారు.

మహేంద్రుడు నవ్వుకుంటూ మంచంమీద నుంచి క్రిందకు దొర్లాడు చప్పట్లు కొట్టుకుంటూ.